సాక్షి
నిర్మల్
సోమవారం । 10 । ఏప్రిల్ । 2023



నమాజ్ చేద్దాం రండి..!
ఇస్లాం సంప్రదాయంలో అత్యంత ముఖ్య భూమికను అజాన్ పోషిస్తుంది. అజాన్ అంటే నమాజ్ చేద్దాం రండి అని పిలవడం. అజాన్ చరిత్రపై ప్రత్యేక కథనం.. 8లో▸



నీటికుంట తీర్చేను చింత
మేతకు వెళ్లిన పశువులతోపాటు అడవి జంతువుల దాహార్తి తీర్చేందుకు ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామాల శివారులో నీటికుంటల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
37.5 / 24.7
ఆకాశంలో అక్కడక్కడా మేఘాలు ఉంటాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వేడి, ఉక్కపోత పెరుగుతాయి. గాలిలో తేమశాతం తగ్గుతుంది. సాయంత్రం ఒకటి రెండు చోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.



న్యూస్‌రీల్

నరసింహస్వామి నేత్రాలను తాకిన సూర్యకిరణాలు


స్వామివారి నేత్రాలపై సూర్యకిరణాలు

దస్తురాబాద్: మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ గర్భగుడిలోని స్వామివారి నేత్రాలు, సుదర్శన చక్రాన్ని ఆదివారం సూర్యకిరణాలు తాకాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ ఎప్పుడూ స్వామి వారి పాదాలపై పడే సూర్యకిరణాలు ఇప్పుడు స్వామి వారి నేత్రాలు, సుదర్శన చక్రాన్ని తాకడం విశేషమన్నారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.


రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

నిర్మల్‌రూరల్: తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో అండర్-20 బాలబాలికలకు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మనాభంగౌడ్, సామ్యూల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రన్స్, త్రోస్, జంప్స్‌లలో ఈ పోటీలు ఉంటాయని వారు పేర్కొన్నారు. పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన వారు ఈ నెల 15, 16 తేదీల్లో హన్మకొండలోని జెన్ స్టేడియం లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు 9133713979 నంబరులో సంప్రదించాలని వారు సూచించారు.

నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించాలి

నిర్మల్‌రూరల్: జిల్లాలో సోమవారం జరుగనున్న పదో తరగతి సైన్స్ పరీక్షను నిబంధనల ప్రకారం నిర్వహించాలని విద్యాశాఖ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం పదో తరగతి పరీక్ష కేంద్రాల ముఖ్య పర్యవేక్షకులు, డిపార్టుమెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్లతో డీఈవో కార్యాలయం నుంచి జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు కాంపోజిట్ ఫస్ట్ లాంగ్వేజ్, సైన్స్ పరీక్షలు ఉదయం 9:30 నుంచి 12:50 వరకు ఉంటాయన్నారు. పార్ట్-1 పేపర్ 60 మార్కులకు, పార్ట్-2 పేపర్ 20 మార్కులకు ఉంటుందన్నారు. ఎలాంటి అయోమయానికి గురికాకుండా, విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా పరీక్ష నిర్వహించాలని సూచించారు. సమావేశంలో పరీక్షల సహాయ కమిషనర్ పద్మ, ఎంఈవోలు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా సత్యం


తొటం సత్యం

కడెం(ఖానాపూర్): మహాత్మా జ్యోతిబా పూలే జయంతి ఉత్సవ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన తొటం సత్యంను రాష్ట్ర ప్రభుత్వం నియమించినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 11న నిర్వహించనున్న పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సత్యం తెలిపారు.

సీఎంఆర్ మాయం..!



- గడువు ముగిసినా అప్పగించని మిల్లర్లు
- గోదాముల్లో ధాన్యం స్టాకుపై అనుమానాలు
- తనిఖీలు చేస్తే వెలుగులోకి..

భైంసాటౌన్(ముధోల్): ప్రభుత్వం రైస్‌మిల్లులకు సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యం మాయమవుతోంది. నిర్దేశిత గడువులోగా మిల్లింగ్ చేసి బియ్యం అప్పగించాల్సి ఉండగా కొందరు మిల్లర్లు తీవ్ర జాప్యం చేస్తున్నారు. ప్రభుత్వ ధాన్యం పక్కదారి పట్టిస్తూ రేషన్‌బియ్యం కొనుగోలు చేసి వాటినే సీఎంఆర్ చేసినట్లు అప్పగిస్తున్నారు. ధాన్యం గోదాముల్లో స్టాకు ఉందా? లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత శాఖ అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరించడం కొందరికి కలిసివస్తోంది. విజిలెన్స్ అధికారులు గోదాముల్లో తనిఖీలు చేసి స్టాకు పరిశీలిస్తే అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

గడువు ముగిసినా...

ప్రభుత్వం ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో రైతుల నుంచి ధాన్యం సేకరించి బియ్యం సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) కోసం రైస్‌మిల్లులకు కేటాయిస్తుంది. నిర్దేశిత గడువులోగా క్వింటాలుకు 67 కిలోల బియ్యం పట్టించి మిల్లర్లు ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో కొందరు రైస్‌మిల్లర్లు సీఎంఆర్ ప్రక్రియలో జాప్యం చేస్తున్నారు. 2021-22 రబీ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం జిల్లాలో 32 రైస్‌మిల్లులకు ధాన్యం కేటాయించింది. మార్చి 31 వరకు మిల్లింగ్ పూర్తి చేసి ప్రభుత్వానికి బియ్యం అందించాల్సి ఉండగా ఈ నెల 5వ తేదీ వరకు 55.35 శాతం మాత్రమే మిల్లింగ్ పూర్తి చేశారు. అంటే లక్ష్యంలో సగం మాత్రమే పూర్తయింది. కొందరు రైస్‌మిల్లర్లు మిల్లింగ్‌లో తీవ్ర జాప్యం చేస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. భైంసా డివిజన్‌లోని ఓ రైస్‌మిల్‌లో ఇప్పటివరకు 5 శాతమే మిల్లింగ్ చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అంతేకాకుండా కొంతమంది రైస్‌మిల్లుల నిర్వాహకులు సీఎంఆర్ ధాన్యం పక్కదారి పట్టిస్తున్నారు. మిల్లింగ్ చేయకుండానే ఇతర ప్రాంతాల నుంచి బియ్యం తెచ్చి వాటినే సీఎంఆర్ చేసినట్లు చూపిస్తున్నారు. ఇవన్నీ సంబంధిత శాఖ అధికారులకు తెలిసినా 'మామూలు'గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.


జిల్లా కేంద్రంలోని ఓ రైస్‌మిల్లులో ధాన్యం

భైంసా డివిజన్‌లోనే తక్కువ...

జిల్లాలోని కొన్ని రైస్‌మిల్లుల్లో సీఎంఆర్ ప్రక్రియ రెండంకెల లక్ష్యం చేరలేదంటే అతిశయోక్తి కాదు. అధికారుల గణాంకాల ప్రకారమే 2021-22 రబీ సీజన్‌కు సంబంధించి 32 రైస్‌మిల్లులకు ధాన్యం కేటాయించగా ఆరు మిల్లుల్లో వందశాతం లక్ష్యం పూర్తయింది. మరో 9 మిల్లుల్లో 90 శాతం వరకు పూర్తి కాగా భైంసా డివిజన్ పరిధిలోని 11 రైస్‌మిల్లుల్లో మాత్రం 30 శాతం కూడా దాటలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. సంబంధిత శాఖ జిల్లా అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సీఎంఆర్ ప్రక్రియ వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

2021-22 రబీ సీజన్ సీఎంఆర్ వివరాలు (టన్నుల్లో)

కేటాయించిన ధాన్యం	98,776.640
అందించాల్సిన బియ్యం	66,593.620
ఇప్పటి వరకు అందించినవి	36,859.640
ఇంకా అందించాల్సినవి	29,733.980

చర్యలు తీసుకుంటాం



రబీ 2021-22 సీజన్‌కు సంబంధించి జిల్లాలో ఇప్పటివరకు 55 శాతం సీఎంఆర్ పూర్తయింది. మరో నెల గడువు పెంచాలని ఆదేశాలు అందాయి. గడువులోగా లక్ష్యం చేరని వారిపై చర్యలు తీసుకుంటాం.
– తనూజ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

రాంజీకి తీరని అన్యాయం


నివాళులర్పిస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు


నివాళులర్పిస్తున్న ఆశ్రమం నాయకులు

- వనవాసీ కళ్యాణ ఆశ్రమం క్షేత్ర విద్యా ప్రముఖ్ వెంకటేశ్వరరావు దేశ్‌పాండే
- రాంజీ సహా అమరులకు ఘన నివాళి

నిర్మల్: దేశ స్వాతంత్య్ర చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘట్టం నిర్మల్ గడ్డమీద వెయ్యి మంది వీరుల ప్రాణత్యాగం అని, రాంజీగోండుకు చరిత్రలో తీరని అన్యాయం జరిగిందని వనవాసీ కళ్యాణ ఆశ్రమం తెలంగాణ, ఆంధ్ర, మహారాష్ట్ర క్షేత్ర విద్యా ప్రముఖ్ వెంకటేశ్వరరావు దేశ్‌పాండే అన్నారు. రాంజీగోండు సహా వెయ్యిమంది అమరుల వర్ధంతిని పురస్కరించుకుని ఆశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక చైన్‌గేట్ వద్దగల రాంజీ, కుమురం భీం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దండకారణ్యంతో పాటు ఈ ప్రాంతాన్నంతా దాదాపు వెయ్యేళ్లపాటు ఆదివాసీలు పరిపాలించారని, ఆంగ్లేయుల నుంచి అటవీ ప్రాంతాన్ని, ఆదివాసీల హక్కులను కాపాడేందుకు ప్రాణాలను సైతం అర్పించారన్నారు. ప్రథమ భారత స్వాతంత్య్ర సంగ్రామ సమయంలో ఆసిఫాబాద్ నుంచి నిర్మల్ ప్రాంతానికి వచ్చి రోహిల్లాలు, ఆదివాసీ వీరులతో కలిసి ఆంగ్లేయ, నైజాం సైన్యాలపై రాంజీగోండు పోరాటం చేశారన్నారు. ఆయనను, ఆయన సైన్యాన్ని అప్పటి పాలకులు దొంగదెబ్బ తీసి ఒకే మర్రిచెట్టుకు ఒకేసారి వెయ్యిమందిని ఉరితీశారన్నారు. జలియన్ వాలాబాగ్ ఘటన కంటే ముందే జరిగిన ఈ ఉదంతాన్ని చరిత్రలో ఎక్కడా పేర్కొనకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు అమరుల వర్ధంతి కార్యక్రమాన్ని అన్ని వర్గాలతో కలిపి అధికారికంగా నిర్వహించాలని, వారి స్మారకంగా అమరధామం, మ్యూజియంలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వనవాసీ కళ్యాణ ఆశ్రమం రాష్ట్ర విద్యా ప్రముఖ్ మైసర్ల శంకర్, మంచిర్యాల నాగభూషణం, ప్రవీణ్, కిన్నెర రవి, నరేశ్, రమేశ్, ఆదివాసీ సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఆదివాసీ, రాంజీగోండు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు నైతం భీంరావు ఆధ్వర్యంలో తుడుం చప్పుళ్లతో, పూలమాలతో అమరులకు నివాళులర్పించారు.

వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో..

జిల్లా కేంద్రంలోని చైన్‌గేట్ వద్దగల రాంజీగోండు విగ్రహం, అలాగే నిర్మల్-ఎల్లపల్లి దారిలో గల వెయ్యిమంది అమరుల స్తూపం వద్ద నిర్మల వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. సమితి సభ్యులు గంగిశెట్టి ప్రవీణ్, నాయుడు మురళీధర్, లక్కడి శ్రావణ్ రెడ్డి, నాంపల్లి శశిరాజ్ వర్మ, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

తుడుందెబ్బ ఆధ్వర్యంలో..

తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆదివాసీ నాయకులు అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. రాంజీ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని, వెయ్యిఉరుల చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలన్నారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకగారి భూమయ్య, జిల్లా అధ్యక్షుడు సాకీ లక్ష్మణ్, రాంజీగోండు సేవా సంఘం నాయకులు మునలి చిన్నయ్య, తొడసం గోవర్ధన్, సర్పంచ్ సూరపు సాయన్న, ముచ్చింట్ల శంకర్, రమేష్, గంగాధర్, నాగరాజు, సతీష్, మహేష్, నారాయణ, రాములు తదితరులు ఉన్నారు.

సమరయోధుల జీవితాలు పాఠ్యాంశం కావాలి

నిర్మల్‌చైన్‌గేట్: నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్య్ర సమరయోధుల జీవితాలను పాఠ్యాంశాల్లో చేర్చాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్ అన్నారు. రాంజీగోండు వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం చైన్‌గేట్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, బీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు తోట సత్యనారాయణ, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్, నాయకులు అయ్యన్నగారి రాజేందర్, రాఘవేంద్ర చారి, కందుల రవి, కపిల్, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

ముందుగా చెల్లిస్తే 5 శాతం రాయితీ

- మున్సిపాలిటీల్లో ఎర్లీబర్డ్ పథకం
- ఈ నెల 30 వరకు అవకాశం

నిర్మల్‌చైన్‌గేట్: మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను ముందుగా చెల్లించేవారికి రాష్ట్ర పురపాలక శాఖ రాయితీ కల్పించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్నును ఈ నెల 30 లోపు చెల్లించేవారికి 5 శాతం రాయితీని పురపాలక శాఖ ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఎలాంటి బకాయిలు లేనివారికి ఈ రాయితీ ఇచ్చారు. బకాయి భారీగా ఉండటంతో వసూలు చేసేందుకు రాష్ట్ర పురపాలిక శాఖ ఈ అవకాశం కల్పించింది. సక్రమంగా ఆస్తి పన్ను చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ ఊరట ఇస్తోంది. నూతన ఆర్థిక సంవత్సరంలో పన్ను మొత్తం చెల్లిస్తే మళ్లీ బకాయిలు ఉన్నాయని పురపాలకశాఖ అధికారులు వచ్చి ఇబ్బందులు పెట్టే అవకాశం ఉండదు.

ఎవరు అర్హులంటే..

ఆస్తిపన్ను ముందస్తుగా చెల్లించే వారికి ప్రోత్సాహకంగా ప్రభుత్వం ఎర్లీబర్డ్ పథకాన్ని అమలు చేస్తుంది. 2022 – 23 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను పూర్తిగా చెల్లించిన వారితోపాటు బకాయిలను పెనాల్టీతో కట్టిన వారికి మాత్రమే 5 శాతం రాయితీ వర్తిస్తుంది. రాయితీ పొందాలంటే ఏప్రిల్ 30లోగా మున్సిపల్ కార్యాలయాల్లో, సీడీఎంఏ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో పన్ను చెల్లించడానికి అవకాశం ఉంది.

ప్రత్యేక కేంద్రాల ఏర్పాటు..

మున్సిపాలిటీల్లో ఎర్లీబర్డ్ పథకం అమలులో భాగంగా పన్నుల వసూలుకు ప్రత్యేక కేంద్రాలను తెరవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. వార్డుల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు బిల్ కలెక్టర్లకు కూడా లక్ష్యాలను నిర్దేశించనున్నారు. ఈ పథకం అమలుపై నివేదికలను ఎప్పటికప్పుడు సమర్పించాలని ఉన్నతాధికారులు సూచించారు. ఏటా ఆస్తి పన్నులో వడ్డీ మాఫీని అమలు చేస్తున్నారు. కోవిడ్ సమయంలో రూ.10 వేలలోపు ఆస్తిపన్ను కలిగిన వారికి 50 శాతం వరకు మాఫీ చేశారు. ప్రస్తుతం ఆస్తి పన్ను ముందస్తుగా చెల్లించే వారికి 5 శాతం రాయితీ ఇస్తున్నారు.



నిర్మల్ మున్సిపల్ కార్యాలయం

ఇకపై ఏడాదికి ఒకేసారి..

ఇకపై మున్సిపాలిటీలో ఏడాదికి ఒకేసారి ఆస్తి పన్ను డిమాండ్ నోటీసులను జారీ చేయనున్నారు. గతంలో ఆరు నెలలకు ఒకసారి ముందస్తుగా ఆస్తిపన్ను చెల్లింపుపై వివరాలతో కూడిన నోటీసులను జారీ చేసేవారు. ఈ నిర్ణయంతో ఏడాది పన్ను ఒకేసారి మున్సిపాలిటీలు పొందే అవకాశం ఉంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో మున్సిపల్ జనరల్ ఫండ్ ఖాతా నిండుకుండలా మారే అవకాశం ఉంది.

జిల్లాలో ఇలా..

జిల్లాలో నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటి పరిధిలో గతనెల 29వ తేదీ వరకు నిర్మల్ మున్సిపాలిటీలో 22,312 అసెస్మెంట్లకుగాను రూ.14.45 కోట్ల బకాయి ఉండగా రూ. 4.39 కోట్లు వసూలయ్యాయి. భైంసా మున్సిపాలిటీలో 11,510 అసెస్మెంట్లకు రూ.2.35 కోట్ల బకాయి ఉండగా రూ.1.55 కోట్లు వసూలు చేశారు. ఖానాపూర్ మున్సిపాలిటీలో 6,604 అసెస్మెంట్లకు రూ.1.05 కోట్లు బకాయి ఉండగా, రూ.0.53 కోట్లు వసూలయ్యాయి. ఎలాంటి ఒత్తిడి లేకున్నా సమయానికి 15 నుంచి 20 శాతం వరకు భవనాల యజమానులు పన్ను చెల్లిస్తున్నారు. వీరంతా రాయితీని సద్వినియోగం చేసుకుని పన్ను ముందుగానే చెల్లించే అవకాశం ఉంది. దీంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

మున్సిపాలిటీలు, అసెస్మెంట్ల సంఖ్య

మొత్తం మున్సిపాలిటీలు	3
నిర్మల్	22,312
భైంసా	11,510
ఖానాపూర్	6,604

సద్వినియోగం చేసుకోవాలి..



రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 5 శాతం రాయితీని భవన యజమానులు సద్వినియోగం చేసుకోవాలి. రాయితీ అవకాశం ఈ నెలాఖరు వరకు మాత్రమే ఉంది. పన్ను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి.
– సీవీఎన్.రాజు, మున్సిపల్ కమిషనర్, నిర్మల్

కరుణ చూపండి.. క్రమబద్ధీకరించండి

- ఆశల పల్లకిలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు
- నాలుగేళ్లు కావస్తున్నా పర్మినెంట్ ఊసేలేదు..
- సక్రమంగా అందని వేతనాలు

నిర్మల్‌చైన్‌గేట్: ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానంలో నిలవాలనుకుని వచ్చిన ప్రభుత్వ ఉద్యోగ అవకాశం వదలకూడదని గ్రామ కార్యదర్శి ఉద్యోగంలో చేరారు. వారిపై పనిభారం పెరిగినా భరిస్తూ వస్తున్నారు. తమ ఉద్యోగం క్రమబద్ధీకరణ జరగకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నూతన పంచాయత్ యాక్ట్ తీసుకువచ్చి జీపీలను ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం 2018 ఏప్రిల్ 12న జిల్లాలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నియమించింది. ఈ నెల 12 నాటికి వారికి నాలుగేళ్లు పూర్తికానున్నాయి. మూడేళ్ల ప్రొబేషనరీ పీరియడ్‌తో 15 వేల వేతనం ఇస్తూ పనితీరు ఆధారంగా క్రమబద్ధీకరణ చేస్తామంటూ షరతులు విధించింది. అయితే నియామకం జరిగి నాలుగేళ్లు కావొస్తున్నా తెలంగాణ రెగ్యులరైజేషన్ ఆఫ్ అపాయింట్‌మెంట్ యాక్ట్‌కు విరుద్ధంగా జీవో 26 ద్వారా ప్రొబేషనరీ పీరియడ్‌ను మరో ఏడాది పెంచింది.

మూడు భాగాలుగా విభజన

రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం మూడు భాగాలుగా విభజించింది. కొందరిని సీనియర్ కార్యదర్శులు (గ్రేడ్-1), జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, మరికొందరిని ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులని నామకరణం చేసింది.

ప్రభుత్వ ప్రయోజనాలు అందక....

పంచాయతీ కార్యదర్శులు ప్రమాదాల బారినపడి మరణిస్తే ప్రభుత్వం అందించే ప్రయోజనాలు అందకుండా పోతున్నాయి. కొందరు ప్రమాదాల బారినపడి మరికొందరు పనిఒత్తిడి తట్టుకోలేక ఇతరత్రా కారణాలతో మరణిస్తే ఎలాంటి ప్రయోజనం ఉండడం లేదు. ఔట్‌సోర్సింగ్ విధానాన్ని ఎత్తివేసి తమను కూడా జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా పరిగణించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు.

సకాలంలో వేతనాల్లేవ్..

రెగ్యులర్ కార్యదర్శులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నా ప్రతినెలా వేతనాలు చెల్లించడంలేదని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. ఓపీఎస్ పంచాయతీ కార్యదర్శులు జిల్లాలో 11 మంది పనిచేస్తున్నారు. వీరికి చెల్లించేది రూ.15 వేల వేతనం. ఇది వారి ప్రయాణాలు, ఇతరత్రా ఖర్చులకే సరిపోవడం లేదు. ఔట్ సోర్సింగ్ కార్యదర్శులకు నాలుగు నెలలుగా, జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు రెండు నెలలుగా వేతనాలు చెల్లించడంలేదని, ప్రతీనెల ఇలాగే జరుగుతోందని వాపోతున్నారు.

జీపీఎస్‌గా పరిగణించాలి

రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు రూ.28,719 వేతనం ఇస్తూ ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు రూ.15వేలు మాత్రమే ఏజెన్సీల ద్వారా అందజేస్తున్నారని, అవికూడా ఎప్పుడు వస్తాయో తెలియదని పేర్కొంటున్నారు. తమ సమస్యలపై సంబంధిత కమిషనర్, ప్రజాప్రతినిధులకు మొర పెట్టుకున్నా ఫలితం లేదంటున్నారు.


డ్రైయినేజీ శుభ్రం చేయిస్తున్న కార్యదర్శి

జిల్లా వివరాలు

మండలాలు	18
గ్రామ పంచాయతీలు	396
విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు	392
ఖాళీగా ఉన్న పోస్టులు	04
రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు	65
జూనియర్ పంచాయతీ కార్యదర్శులు	316
ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు	11

అదనపు పనులతో సతమతం

పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీలో కేటాయించే పనుల కంటే అదనంగా ఇతర పనులు అప్పజెప్పడంతో సతమతమవుతున్నారు. ఏ ఉద్యోగికైనా జాబ్‌చార్ట్ తప్పనిసరిగా ఉంటుంది. కానీ వీరికి మాత్రం ప్రభుత్వం అలాంటి జాబ్‌చార్ట్ అంటూ ప్రకటించలేదు. గ్రామాలకు సంబంధించిన పనులతో పాటు అధికారులు అప్పగించిన ఇతర అదనపు పనులను కూడా చేస్తున్నారు. మరోవైపు నిర్దిష్ట పని వేళలంటూ లేకుండా పోయాయి. ఉదయం ఏడు గంటలకు విధులకు వెళ్లి రాత్రి ఇంటికి చేరుకుంటున్నారు. ఇంటికొచ్చిన తరువాత కూడా అధికారులు ఎక్కడైన దస్త్రం లేదంటే సమాచారం కావాలని ఆదేశాలిస్తే మళ్లీ కార్యాలయానికి వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

పర్మినెంట్ చేయాలి



జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగ భద్రత లేకపోవడంతో ప్రభుత్వం ద్వారా లభించే ప్రయోజనాలు పొందలేకపోతున్నాం. ఉద్యోగంలో చేరి నాలుగేళ్లు అవుతున్నా పనికి తగిన వేతనాలు లేకపోవడంతో పాటు పనిఒత్తిడితో ఇబ్బందులు పడుతున్నాం. జూనియర్, ఔట్ సోర్సింగ్ కార్యదర్శులను పర్మినెంట్ చేయాలి.
– టి.లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ లచ్చిరాం

నిర్మల్‌రూరల్: ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమ కార్యాచరణ చేపడతామని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ లచ్చిరాం డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లోనే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు ప్రతినెల వేతనాలు చెల్లించాలని, పండిత్, పీఈటీ పోస్టులు ఉన్నతీకరించి పదోన్నతులు కల్పించాలని, జీపీఎఫ్ లోన్లు, పాక్షిక ఉపసంహరణలు, గ్రూప్ ఇన్సూరెన్స్ లోన్లు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, సరెండర్ బిల్లులు, పీఆర్సీ బకాయిలు, తదితర బిల్లులన్నీ తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పలు రాష్ట్రాలు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించేందుకు చర్యలు చేపడుతున్నాయని, ఇదే విధానాన్ని తెలంగాణలో కూడా చేపట్టాలన్నారు. ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా సంఘానికి సేవలందించిన సారంగాపూర్ మండల నాయకులు కరిపె శివప్రసాద్‌ను సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, తోడిశెట్టి రవికాంత్, జిల్లా కోశాధికారి పోల ధర్మరాజ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట గంగాధర్, గౌరవ అధ్యక్షుడు పరమేశ్వర్‌రెడ్డి, జిల్లా సహాధ్యక్షుడు వాహిద్‌ఖాన్, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తుమ్మ లచ్చిరాం

ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి


శిబిరాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ రాజేందర్

ఖానాపూర్: తెలంగాణ కార్మికశాఖ, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన సంపూర్ణ ఆరోగ్య శిబిరాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని తాపీమేస్త్రీ సంఘ భవనంలో భవన నిర్మాణ కార్మికులకు ఏర్పాటు చేసిన శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సీఎస్‌సీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కడుకుంట్ల రవి, చిలుకూరి ఇస్తారి, కోశాధికారి కడుకుంట్ల నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయంలో చోరీ



చోరీకి గురైన హుండీ

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ భీమన్న ఆలయంలో చోరీ జరిగింది. ఆదివారం ఆలయానికి గ్రామస్తులు వెళ్లగా హుండీ పగులగొట్టి ఉంది. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీని పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

టిప్పర్ బోల్తా



కుంటాల వద్ద బోల్తాపడ్డ టిప్పర్

నేరడిగొండ: మండలంలోని కుంటాల(కె) గ్రామం వద్ద ఆదివారం టిప్పర్ బోల్తా పడడంతో ప్రమాదం తప్పింది. నిర్మల్ నుంచి కంకర లోడ్‌తో వెంకటాపూర్ గ్రామానికి వెళ్తుండగా కుంటాల ఘాట్స్ వద్ద బ్రేక్ ఫెయిల్ అయి జనావాసాలు ఉండే ప్రాంతంలో బోల్తా పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.

కూచిపూడిలో సంధ్యకు నంది అవార్డు



అవార్డు తీసుకుంటున్న చిన్నారి సంధ్య

నిర్మల్‌టౌన్: శిఖరం ఆర్ట్స్ థియేటర్ గానసభ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం ఉగాది పురస్కారం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కూచిపూడి నాట్యంలో నిర్మల్‌కు చెందిన చిన్నారి పులి సంధ్యకు నంది అవార్డు అందుకుంది. సంధ్యకు నంది అవార్డు రావడం ఆనందంగా ఉందని తండ్రి వెంకటస్వామి అన్నారు.

టేకు చెట్లు నరికిన ఇద్దరి రిమాండ్



సబ్ జైలుకు తరలిస్తున్న పెంబి రేంజ్ ఫారెస్ట్ అధికారులు

పెంబి: టేకు చెట్లు నరికి అక్రమంగా తరలిస్తుండగా ఇద్దరి నిందితులను పట్టుకుని రిమాండ్ తరలించినట్లు ఎఫ్ఆర్‌వో రామకృష్ణ, డీఆర్‌వో ప్రతాప్ నాయక్ తెలిపారు. ఆరుగురు పరారయ్యారు. వారి కథనం ప్రకారం..పెంబి రేంజ్ పరిధిలోని దోందారి బీట్‌లో ఉట్నూర్ మండలం చిన్న గంగాపూర్‌లో 8 మంది నిందితులు 12 టేకుచెట్లు నరికిన దుంగలను ఉట్నూర్‌కు తరలిస్తున్నారని సమాచారం అందింది. తనిఖీ చేయగా ఆరుగురు పరారయ్యారు. ఇద్దరు నిందితులు టేకం దేవురావ్, ఆరే కన్నయ్యను పట్టుకుని ఆదివారం మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా..14 రోజులు రిమాండ్ నిమిత్తం నిర్మల్ సబ్ జైలుకు తరలించినట్లు తెలిపారు. టేకు చెట్ల విలువ రూ.3 లక్షల55 వేలు ఉంటుందన్నారు. ఇందులో ఎఫ్ఎస్‌వో రవి, ఎఫ్‌బీవో రాజు, పెంబి రేంజ్ సిబ్బంది ఉన్నారు.

నమాజ్ చేద్దాం రండి..!



నమాజ్ చేస్తున్న ముస్లింలు (ఫైల్)

అజాన్ ఇస్తున్న ముస్లిం

కెరమెరి(ఆసిఫాబాద్): ఇస్లాం సంప్రదాయంలో అత్యంత ముఖ్య భూమికను అజాన్ పోషిస్తుంది. అజాన్ అంటే నమాజ్ చేద్దాం రండి అని పిలవడం. రోజుకు ఐదుసార్లు మసీద్‌ల నుంచి మైక్‌ల్లో ఈ పిలుపు వినపడగానే ముస్లింలు నమాజ్‌కు సన్నద్ధమవుతారు. అప్పటి వరకు చేస్తున్న పనులను పక్కనపెట్టి పవిత్ర హృదయాలతో మసీదుకు బయలుదేరుతారు. రోజు ఐదుసార్లు మసీదు నుంచి వెలువడే (దివ్య) వాణినే అజాన్ అంటారని ముస్లిం పెద్దలు చెబుతున్నారు. అజాన్ చరిత్రపై ప్రత్యేక కథనం!

- అజాన్‌కు ఘన చరిత్ర
- ప్రవక్త మెచ్చిన పిలుపు
- మసీదు నుంచి వెలువడే దివ్యవాణి
- రంజాన్ మాసం ప్రత్యేకం

అజాన్ ఇలా మొదలైంది.

మహ్మద్ ప్రవక్త, ఆయన అనుచరులు మక్కాలో ఉన్నంత కాలం తాము ఉంటున్న ఇంటిలోనే నమాజ్ చేసేవారు. అల్లా ఆజ్ఞ ప్రకారం మహ్మద్ ప్రవక్త మక్కా నుంచి మదీనాకు వలసవెళ్లారు. మదీనా చేరిన వెంటనే అక్కడ నమాజ్ చేయడానికి వీలుగా మసీదు నిర్మాణం చేపట్టారు. అయితే ముస్లింలను ఎలా ఆహ్వానించాలనే ప్రశ్న తలెత్తింది. శంఖం ఊదితే బాగుంటుందని కొందరు.. కాగడా వెలిగిద్దామని మరికొందరు తమ అభిప్రాయాలు వెల్లడించారు. అందులో అబ్దుల్లాబీన్ జైద్ వచ్చి ×నేను ఒక కల గన్నాను. నమాజ్ కోసం అందరిని పిలుస్తున్నా..· అని అజాన్ గురించి వివరించారు. ×అల్లాహు అక్బర్.. అల్లాహు అక్బర్.. లాహి లాహి ఇల్లల్లాహి· అని ఆయన లయబద్ధంగా పాడి వినిపించారు. ఈ పదాలు ప్రవక్తకు నచ్చడం , అంతలోనే దైవవాణి (వహీ) కూడా అవతరించడంతో అబ్దుల్లాబిన్ జైద్‌కు వచ్చిన స్వప్నం నిజమని ప్రవక్త ధ్రువీకరించారు. మహ్మద్ ప్రవక్త జైద్ ను పిలిచి అజాన్ పలుకులను హజ్రత్ బిలాల్ (రజీ) కు నేర్పించాలని సూచించారు. అలా మొదటి సారి అజాన్ హజ్రత్ బిలాల్ పలికారు. ఈ పిలుపు వినగానే ముస్లింలు నమాజ్ చేయాలనే ఉద్దేశంతో మసీదుకు తరలివచ్చారు.



ఈద్గా వద్ద నమాజ్ చేస్తున్న ముస్లింలు

నమాజ్‌కు రావాలనే భావన ఉంది.

అజాన్‌లో అల్లా గొప్పతనం, నమాజ్ ప్రాముఖ్యత ప్రధానంగా ఉంటుంది. దైవవాణి వినిపిస్తుంది. అందరూ నమాజ్ కోసం రావాలనే భావనను అజాన్ చెబుతుంది. రోజుకు ఐదుసార్లు అజాన్ ఉంటుంది. సూర్యోదయానికి ముందు చేసేదాన్ని ఫజర్ అని, మధ్యాహ్నం ఇచ్చే పిలుపును జోహర్ అని పిలుస్తారు. సాయంత్రం అసర్, సూర్యాస్తమయంలో మగరీబ్, రాత్రికి ఇచ్చే పిలుపును ఇషా అని వ్యవహరిస్తున్నారు. నమాజ్ కు ముందు అజాన్ ఇవ్వడం తప్పనిసరి. రంజాన్, బక్రీద్ పండుగలకు అజాన్‌లోని ముందు చరణాలను పలుకుతూ ముస్లింలు నమాజ్‌కు వెళ్తారు.

నమాజ్‌కు ప్రాధాన్యం..

నేరడిగొండ: రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు ఉండడమే కాకుండా నమాజ్ చదువుతారు. అల్లాహ్ దీవెనల కోసం ఐదుసార్లు నమాజ్‌తో పాటు తరావీ నమాజ్ (ఖురాన్ పఠనం) చేస్తారు. నమాజ్‌లో అల్లాహ్‌ను ప్రార్థించడమే కాదు.. సంపూర్ణ ఆరోగ్యం, క్రమ శిక్షణ కూడా అలవడుతుందని వారి నమ్మకం. నమాజ్ వెనుక దాగిన అసలు పరమార్థం ఇదేనని వారి విశ్వాసం. ముస్లింలు చేసే నమాజ్‌లో తక్బీర్, ఖియాం, రుకూ, సజ్దా, సలాం అనే క్రియలు ఉంటాయి. వాటితో ఎన్నో ఉపయోగాలున్నాయి.

‘గిరి’ గ్రామాల్లో సైన్స్ ఒలింపియాడ్ స్కూళ్లు

- ఉమ్మడి జిల్లాలో ఎనిమిది మంజూరు
- వచ్చే సంవత్సరం ప్రారంభం
- పాఠశాలల్లో ప్రవేశాలకు పరీక్ష నేడు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ఉమ్మడి జిల్లాలో పరీక్ష రాసేవారు..

జిల్లా	ఆశ్రమపాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
ఆదిలాబాద్	51	2040
ఆసిఫాబాద్	46	1840
మంచిర్యాల	16	640
నిర్మల్	17	680



ప్రశ్నపత్రాలతో సిబ్బంది

ఉట్నూర్: ఐటీడీఏ గిరిజన సంక్షేమశాఖ ఆధీనంలో ఉమ్మడి జిల్లాలో ఎనిమిది సైన్స్ ఒలింపియాడ్ మోడల్ ఆశ్రమ పాఠశాలలు వచ్చే విద్యాసంవత్సరంలో ప్రారంభం కానున్నాయి. బాల,బాలికలకు వేర్వేరుగా ప్రతి జిల్లాకు రెండు ఆశ్రమ పాఠశాలల చొప్పున 8 మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న 4, 5, 6, 7, తరగతుల్లో ఒక్కో తరగతికి 40 మంది చొప్పున విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. ఇందుకోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సోమవారం నిర్వహించే ప్రవేశపరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

ప్రతిపాదనలు సిద్ధం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 132 ఆశ్రమ పాఠశాలలున్నాయి. వీటిల్లో దాదాపు 36 వేలకు పైగా గిరిజన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో సైన్స్ ఒలింపియాడ్ మోడల్ ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు కానున్నాయి. జిల్లాలో ఏయో ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. పాఠశాలల ప్రారంభం నాటికి విద్యార్థుల ప్రవేశాలకు ఇబ్బంది లేకుండా ఎంపిక కోసం గిరిజన సంక్షేమ శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది.

ప్రత్యేక బోధన..

ఒలింపియాడ్ మోడల్ ఆశ్రమ పాఠశాలల్లో ఎంపికైన గిరిజన విద్యార్థులకు ప్రత్యేక విద్యాబోధన అందించనున్నారు. గణితం, సైన్స్, ఇంగ్లిష్ ప్రాధాన్యత గుర్తించి ప్రభుత్వం ఆయా అంశాల్లో వారిని తీర్చిదిద్దనుంది. ప్రస్తుతం గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 4, 5, 6, 7 తరగతి చదువుతున్న విద్యార్థులకు సైన్స్ ఒలింపియాడ్ మోడల్ ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ప్రవేశపరీక్ష ఉంటుంది. మొత్తం 5,200 మంది పరీక్షకు హాజరుకానున్నారు.

ఏర్పాట్లు పూర్తి



ఒలింపియాడ్ మోడల్ ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తిచేశాం. 5200 మంది గిరిజన విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పకడ్బందీగా పరీక్ష నిర్వహించేలా ఏర్పాట్లు పూర్తయ్యాయి.

– జగన్, ఏసీఎమ్‌వో, ఐటీడీఏ ఉట్నూర్

అ‘పూర్వ’ సమ్మేళనం

భైంసా: బాసరలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1989–90 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. విద్యార్థులు ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకుని యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.

‘అతిథులకు’ జీతాల్లేవ్



విద్యార్థులకు పాఠం బోధిస్తున్న గెస్ట్ లెక్చరర్

- ఆరునెలలుగా అందక ఇబ్బందులు
- కుటుంబ పోషణ భారం
- ఉమ్మడి జిల్లాలో 186 మంది గెస్ట్ లెక్చరర్లు

వివరాలు

జిల్లాలు	గెస్ట్ లెక్చరర్లు
నిర్మల్:	39
ఆదిలాబాద్:	53
కుమురంభీం:	40
మంచిర్యాల:	54
మొత్తం:	186

లక్ష్మణచాంద: ప్రభుత్వ కళాశాలలు ఉత్తమ ఫలితాలు వస్తున్నాయంటే అందులో అతిథి అధ్యాపకుల పాత్ర వెలకట్టలేనిది. రెగ్యులర్ లెక్చరర్ల మాదిరిగానే విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ వారి ఉన్నతికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గెస్ట్ లెక్చరర్లకు ఆరునెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ పోషణ భారంగా మారింది. దీనికి తోడు కాంట్రాక్టు అధ్యాపకుల బదిలీ ప్రక్రియ కొనసాగుతుండటంతో మూలిగే నక్కమీద తాటికాయ పడ్డచందంగా తయారైంది. 2013 నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్లు పనిచేస్తున్నారు. గంటకు ప్రభుత్వం రూ.390 చెల్లిస్తోంది. వీరికి నెలకు గరిష్ఠంగా రూ.28,080 ఇస్తోంది.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ కళాశాలల్లో 186 మంది గెస్ట్ లెక్చరర్లు ఉన్నారు. ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో జూలై, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ సంబంధించి వేతనాలు విడుదల చేసింది. జూన్, నవంబర్, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల వేతనాలు రావల్సి ఉన్నాయి. సకాలంలో వేతనాలు అందక వారి కుటుంబాలు ఇబ్బంది పడుతున్నారు. కాంట్రాక్టు అధ్యాపకుల బదిలీ వల్ల నిర్మల్ జిల్లాలో ఇప్పటికే 6 గెస్ట్ లెక్చరర్లు ఉద్యోగాలు కోల్పోయారు. వచ్చే విద్యా సంవత్సరంలో జిల్లాలో ఖాళీ ఉన్నచోట గతంలో పనిచేసిన గెస్ట్ అధ్యాపకులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వం స్పందించి వేతనాలు విడుదల చేయాలని గెస్ట్ లెక్చరర్లు కోరుతున్నారు.

వేతనాలు విడుదల చేయాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు ఆరునెలల నుంచి వేతనాలు రాలేదు. కుటుంబాలకు ఇబ్బందులు ఎదురువుతున్నాయి. ప్రభుత్వం వెంటనే వేతనాలు విడుదల చేయాలి. – జి. సాయినాథ్, గెస్ట్ లెక్చరర్ల సంఘం, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు

కుటుంబ పోషణ భారం



నిర్మల్ జిల్లా ముథోల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌గా పని చేస్తున్నా. ఈ విద్యాసంవత్సరంలో జూన్, నవంబర్, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల వేతనాలు రాలేదు. కుటుంబ పోషణ భారంగా ఉంది. అధికారులు త్వరగా వేతనాలు ఇప్పించాలి.

– ముత్యం, గెస్ట్ లెక్చరర్

సమస్య పరిష్కరిస్తాం



గతంలో జిల్లాలోని గెస్టు లెక్చరర్ల వేతనాలు డీఐఈవో కార్యాలయం నుంచి పంపేవారు. కాని ఇప్పుడు వారు పనిచేసే కళాశాలల ప్రిన్సిపాళ్ల నుంచి ఇస్తారు. రెండు రోజుల్లో వారితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం.

– పరశురామ్, ఇంటర్ నోడల్ అధికారి

‘అడెల్లి’లో భక్తుల సందడి



బాలాలయం ఎదుట దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ ఆలయం ఆదివారం భక్తుల సందడితో కిటకిటలాడింది. ఉ మ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచే కాక నిజామాబాద్, కరీంనగర్‌తోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి అ మ్మవారికి మొక్కు చెల్లించుకున్నారు. నిర్మల్ డీఎస్పీ జీవన్ రెడ్డి కుటుంబసమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన కు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. బాలాలయం ఎదుట ఇబ్బందులు లేకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేపట్టారు. ప్రస్తుతం ఆలయ నిర్మాణం జరుగుతుండటంతో భక్తులు కొంత అసౌకర్యానికి గురయ్యారు.



డీఎస్పీ కుటుంబీకులకు తీర్థప్రసాదాలు అందిస్తున్న అధికారులు

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

బెల్లంపల్లిరూరల్: కుటుంబ కలహాలతో వివాహిత ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని బుచ్చయ్యపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. తాళ్ల గురిజాల ఎస్సై నరేశ్ వివరాల ప్రకారం... బుచ్చయ్యపల్లి గ్రామానికి చెందిన పందుల శేఖర్‌తో బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి రడగంబాల బస్తీకి చెందిన ముక్కెర లక్ష్మి అనే మహిళతో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఇటీవల శేఖర్ మద్యానికి బానిసయ్యాడు. దీంతో తరుచుగా భార్యాభర్తలకు గొడవ జరుగుతుండేది. నిత్యం తాగివచ్చి భార్యతో గొడవ పడేవాడు. కొన్ని రోజుల క్రితం శేఖర్ హనుమాన్ మాల ధరించి శుక్రవారం విరమణ చేసిన మరుసటి రోజే మద్యంతాగి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. మత్తులో ఇంట్లోని టీవీ, సెల్‌ఫోన్ ధ్వంసం చేశాడు.

భరించే ఓపిక లేక ..

శేఖర్‌లో మార్పు రాక పోవడంతో పాటు మళ్లీ యథావిధిగా తాగడం మొదలుపెట్టడంతో లక్ష్మి తీవ్రమైన మానసిక వేదనకు గురైంది. శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. తీవ్రగాయాలైన లక్ష్మిని అదే రాత్రి బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం మృతిచెందింది. ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు. మృతురాలి తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తేనెటీగల దాడిలో ముగ్గురికి గాయాలు

సిర్పూర్(టి): మండలంలోని కంచరపేట గ్రామంలో ఆదివారం తేనె టీగల దాడిలో ముగ్గురు గాయాలపాలయ్యారు. పోచమ్మ ఆలయానికి అమ్మవారి దర్శనం కోసం వెళ్లగా తేనె టీగలు దాడి చేయడంతో కొండబోని రమ పరుగెత్తడంతో కిందపడి కాలు విరిగింది. తిరుపతి, భీమయ్యలకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

బావ బామ్మర్దులను వెంటాడిన మృత్యువు

- సారంగాపూర్ మండలంలో ఇద్దరూ మృతి
- గుడిహత్నూర్ మండలంలో బావ మృతి.. బామ్మర్దికి గాయాలు
- రెండు ప్రమాదాలు.. మూడు కుటుంబాల్లో విషాదం



నాందేవ్ మృతదేహం



శ్రీకాంత్ మృతదేహం

సారంగపూర్(నిర్మల్)/గుడిహత్నూర్(బోథ్): నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో మృత్యువు బావ బామ్మర్దులను వెంటాడింది. రెండు వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృత్యువాతపడ్డారు. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం మహబూబాఘాట్స్ వద్ద జరిగిన ప్రమాదంలో బావ,బామ్మర్ది దుర్మరణం చెందారు. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో బావ మృతిచెందగా, బామ్మర్ది తీవ్రంగా గాయపడ్డాడు. రెండు ప్రమాదాలు మూడు కుటుంబాల్లో విషాదం నింపగా, మృతులు ముగ్గురు ఆదిలాబాద్ జిల్లాకు చెందినవారే. ఇద్దరు ఇచ్చోడ మండలానికి చెందినవారు కాగా, ఒకరు జైనథ్ మండలానికి చెందిన వ్యక్తి. పోలీసులు, బంధువుల కథనం.. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముఖరా(బి) గ్రామానికి చెందిన బెండల్కర్ శ్రీకాంత్(36), జెక్తాఫ్ నామ్‌దేవ్(39) బావ, బామ్మర్దులు. ఇద్దరూ రోజు వారీ కూలీలుగా పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. వారి సమీప బంధువు నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం అడెల్లి మహాపోచమ్మ ఆలయం వద్ద ఆదివా రం పండుగ చేసుకున్నారు. వారి ఆహ్వానం మేరకు శ్రీకాంత్, నామ్‌దేవ్ బైక్‌పై అడెల్లికి వెళ్లారు. బంధువులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. తర్వాత అందరూ విందు చేసుకున్నారు. కార్యక్రమం అనంతరం బైక్‌పై తిరిగి ముఖరా(బి)కి బయల్దేరారు. మహబూబా ఘాట్స్ వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. శ్రీకాంత్, నామ్‌దేవ్ తీవ్రంగా గాయపడ్డారు. నామ్‌దేవ్ సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. శ్రీకాంత్‌ను స్థానికులు నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. దీంతో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రికి వెళ్లి మృతదేహాలను పరిశీలించి శ్రీకాంత్ తల్లి బెండల్ర్ రుక్మిణీబాయికి సమాచారమిచ్చారు. ఆమె ఆస్పత్రికి చేరుకుని బోరున విలపలించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. బస్సును నిర్లక్ష్యంగా నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

44 నంబర్ జాతీయ రహదారిపై..



పెందుర్ స్వామి మృతదేహం

గుడిహత్నూర్ మండలంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై వైజాపూర్ యూటర్న్ వద్ద ఆదివారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్నాయి. బావ దుర్మరణం చెందగా, బామ్మర్ది గాయపడ్డాడు. జైనథ్ మండలం అడ గ్రామానికి చెందిన పెందూర్ స్వామి (25), ఆయన బామ్మర్ది మావల మండలం పల్లి(బి) గ్రామానికి చెందిన దుర్వ సుధాకర్‌తో కలిసి పల్లి(బి) గ్రామానికి బైక్‌పై బయల్దేరాడు. సీతాగోంది గ్రామంలోని వైజాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద వీరు రోడ్డు క్రాస్ చేస్తుండగా, గుడిహత్నూర్ నుంచి ఆదిలాబాద్‌కు బైక్‌పై వస్తున్న రాథోడ్ నరేందర్–అశ్విని దంపతులు ఢీకొన్నారు. ఈ ఘటనలో పెందూర్ స్వామి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సుధాకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నరేందర్–అశ్విని దంపతుల స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు సుధాకర్‌ను ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా, నరేందర్–అశ్విని దంపతులకు స్థానికంగా చికిత్స చేయించారు. ఈ ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.